క్లుప్తంగా

విద్యార్థులకు ఆధార్ స్పెషల్ క్యాంప్ నిర్వహణ



స్పెషల్ ఆధార్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ రఘుబాబు

మద్దిపాడు: స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం ప్రత్యేకంగా ఆధార్ క్యాంప్ నిర్వహించారు. సుమారు 35 మంది వరకూ ఆధార్ సేవలను వినియోగించుకున్నారు. క్యాంప్ జరుగుతున్న తీరును ఈఓపీఆర్‌డీ రఘుబాబు శనివారం మధ్యాహ్నం పరిశీలించారు. పేర్లు మార్చడం, డేటాఫ్ బర్త్ తప్పుగా నమోదు కావడం వంటి వాటిని సరిచేసినట్లు డీఏ పద్మ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అగ్రహారంలో పర్యటిస్తున్న వైద్య సిబ్బంది

చీమకుర్తి రూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, పారిశుధ్యంపై ఇంటింటికి తిరిగి ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. శనివారం వైద్య అధికారులు అగ్రహారం గ్రామంలో పర్యటించి ఆరోగ్యం, పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ అధికారి సీహెచ్ మాధవరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్ గున్యా, మెదడువాపు, ఫైలేరియా వంటి వ్యాధులు సోకకుండా ప్రజలను అప్రమత్తం చేశారు. మురుగు కాలువల్లో పూడికమట్టిని తీయించి బ్లీచింగ్ చల్లించాలని సర్పంచ్ దేవరపల్లి వెంకటలక్ష్మికి సూచించారు. పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించి ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు.

దళితులపై దాడులు జరుగుతుంటే చోద్యం చూస్తారా..?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాల్యాద్రి

ఒంగోలు టౌన్: తమ భూముల్లో అక్రమంగా ఇసుకను ఎందుకు తవ్వుకుంటున్నారని ప్రశ్నించిన దళితుడిని ట్రాక్టర్‌తో ఢీకొట్టి దాడికి పాల్పడిన ఘటన తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో శుక్రవారం జరిగిందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తెలిపారు. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమిని అక్రమించుకోవడమే కాకుండా రౌడీలను పిలిపించి దళితులపై దాడి చేయించిన మరో ఘటన చిత్తూరు జిల్లాలో జరిగిందని, రోజురోజుకు దళితులపై దాడులు పెరిగిపోతున్నా చోద్యం చూస్తున్న చంద్రబాబుకు ఇది మంచిది కాదని హితవుపలికారు. శనివారం స్థానిక కేవీపీఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నాలుగు నెలలుగా రాష్ట్రంలో దళితులపై దాడులు హెచ్చుమీరిపోయాయన్నారు. దళితులపై పదే పదే దాడులు, దుర్మార్గాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో రిలీఫ్ ఫండ్ ఇంకా విడుదల కాలేదని, దాంతో దాడులకు గురైన దళితులు ఆర్థికంగా కూడా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో వెంటనే ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం, ఉపాధ్యక్షుడు రాఘవులు, వి.మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని హాజీపురం ఎత్తు రోడ్డు కింద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. హనుమంతునిపాడుకు చెందిన ఎర్రగుంట్ల దానియేలు ద్విచక్ర వాహనంపై కనిగిరి నుంచి స్వగ్రామం హనుమంతునిపాడు వెళ్తున్న సమయంలో బైక్ అదుపుతప్పి తిరగబడింది. ఈ ప్రమాదంలో క్షతగాత్రుడు దానియేలు తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా కనిగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

కనిగిరి రూరల్: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరి మండలం తుమ్మగుంటకు చెందిన జీ వెంకట నారాయణ (21) ఈ నెల 22న ఆర్థిక సమస్యలు, ఒత్తిళ్ల కారణంగా పురుగుల మందు తాగాడు. పరిస్థితి విషమించడంతో స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి ఒంగోలు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంక్చర్ పక్కా..!

ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం స్థానిక ప్రజల పాలిట శాపంగా మారింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారనడానికి ఒంగోలు నగరపాలక సంస్థ పనితీరే నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికే నగరం మొత్తం పారిశుధ్య లోపంతో అనారోగ్యం పాలైంది. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురుగు కారణంగా దోమలు పెరిగి వ్యాధులు ప్రబలిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. వీటన్నింటిపై సాక్షి దినపత్రికలో నిత్యం కథనాలు, ఫొటోలు ప్రచురించి ప్రజల సమస్యలను కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నప్పటికీ నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడటం లేదు. కేవలం వారి వ్యక్తిగత ఆదాయానికి పనికొచ్చే పనులు మాత్రమే చేసుకుంటూ అవినీతి మత్తులో మొద్దు నిద్రలో కాలం గడుపుతున్నారు. నగరంలో నడిరోడ్లపై ఇనుప మేకులు, వాటివలన వాహనదారులు పడే ఇబ్బందులు కూడా అధికారులు, పాలకులకు నెలల తరబడి కనిపించడం లేదంటే వారి పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- ఒంగోలు నగరంలో పలు చోట్ల పాడైపోయిన రెడీమేడ్ స్పీడ్ బ్రేకర్లు
- కేవలం ఇనుప మేకులు మాత్రమే మిగలడంతో వాహనాల టైర్లకు రంధ్రాలు
- కొన్ని నెలలుగా సమస్య ఉన్నా.. పట్టించుకునే వారే కరువు
- నిర్లక్ష్యంగా నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు



మధ్యమధ్యలో ముక్కలు ఊడిపోయిన రెడీమేడ్ సింథటిక్ స్పీడ్ బ్రేకర్

ఒంగోలు సబర్బన్: నగరంలోని రోడ్లపై ప్రమాదాలు జరగకుండా వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పలు చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా అవసరమైన ప్రాంతాల్లో సిమెంటు రోడ్లతో పాటే సిమెంటు కాంక్రీటుతో స్పీడ్ బ్రేకర్లు నిర్మించారు. రోడ్ల నిర్మాణం అనంతరం కాలక్రమంలో మరికొన్ని చోట్ల స్పీడ్ బ్రేకర్లు అవసరమని గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో రెడీమేడ్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. వీటిని కొన్ని అనవసరమైన ప్రాంతాల్లో కూడా ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు అత్యుత్సాహంతో ఏర్పాటు చేశారు. అక్కడ అవసరమా..అనవసరమా అనే విషయం పక్కనపెడితే.. రెడీమేడ్‌గా ఏర్పాటు చేసిన సింథటిక్ స్పీడ్ బ్రేకర్లు నాణ్యతా లోపం కారణంగానో.. లేకుంటే సక్రమంగా అమర్చకపోవడం వలనో కొన్ని నెలల్లోనే పగిలిపోయి ముక్కలుముక్కలుగా విడిపోయాయి. మధ్యమధ్యలో ముక్కలు పూర్తిగా లేకుండాపోయాయి. అనేకచోట్ల పూర్తిగా శిథిలమైపోయినప్పటికీ.. వాటికి కొట్టిన ఇనుప మేకులు మాత్రం రోడ్డుపై అలాగే ఉన్నాయి. స్థానిక అంబేడ్కర్ భవన్ రోడ్డు, లాయర్‌పేట సాయిబాబా గుడి ఎదురు, తదితర రోడ్లపై వీటితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇనుప మేకులు వాహనాల టైర్లకు గుచ్చుకుని పంక్చర్లవుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై సైతం కొన్ని నెలలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు కూడా ప్రతిరోజూ ఆయా రోడ్లపై తిరుగుతున్నారు. కానీ, పాడైపోయిన రెడీమేడ్ స్పీడ్ బ్రేకర్లు, ప్రమాదకరంగా కనిపిస్తున్న ఇనుప మేకులపై ఏనాడూ దృష్టిసారించిన దాఖలాలు లేవు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా వాహనాల టైర్లు పాడైపోయి ప్రజలు నిత్యం అవస్థపడుతున్నారు. వీటివలన పెనుప్రమాదాలు జరగకముందే నగరపాలక సంస్థ మేల్కోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పాడైపోయిన రెడీమేడ్ స్పీడ్ బ్రేకర్లు, వాటిని అమర్చేందుకు బిగించి ప్రమాదకరంగా మారిన ఇనుప మేకులను పూర్తిగా తొలగించాలని నగరవాసులు కోరుతున్నారు.



ఇనుప మేకుల మీదుగా వెళ్తున్న వాహనం





పాడైపోయిన స్పీడ్ బ్రేకర్ల వద్ద ప్రమాదకరంగా ఉన్న ఇనుప మేకులు

జనగణన లెక్కించమంటే పశుగణన లెక్కిస్తామంటారేం..

ఒంగోలు టౌన్: జనగణన చేయమని అడుగుతుంటే పశుగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు విమర్శించారు. శనివారం స్థానిక సమితి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగణన వాయిదాతో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక ప్రతి పదేళ్లకోసారి మనుషుల జనాభా లెక్కలను, ప్రతి ఐదేళ్లకోసారి పశువుల లెక్కలను లెక్కించాలని కేంద్ర ప్రభుత్వం జాతీయ కార్యక్రమంగా తీసుకుందన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని డిమాండ్ చేసినప్పుడు రిజర్వేషన్ల శాతాన్ని పెంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టులో పిటీషన్లు వేసినప్పుడు 50 శాతం రిజర్వేషన్లు మించకూడదంటూ రిజర్వేషన్లను పెరగకుండా అడ్డుకున్న కేంద్రం.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేసిందని విమర్శించారు. 2024 ఎన్నికలలో బీజేపీకి 400 స్థానాలు వస్తే అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రద్దు చేసి మను ధర్మాన్ని భారత రాజ్యాంగంగా ప్రవేశపెట్టేదన్నారు. అందుకే 2021లో జనాభా లెక్కల్ని బీజేపీ అడ్డుకుందన్నారు. ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకే మోదీ ప్రభుత్వం వర్గీకరణ చిచ్చుపెట్టిందని మండిపడ్డారు. మనువాద మోదీ ఎత్తుగడలను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

పశువులకున్న ప్రాధాన్యత బీసీలకు లేకపోవడం దురదృష్టకరం...

ఒంగోలు వన్‌టౌన్: ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు పశువులపై ఉన్న బాధ్యత, ప్రాధాన్యత బీసీలపై లేకపోవడం దురదృష్టకరమని ఓబీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు జి.వీరభద్రాచారి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వాలు కుక్కలు, కోళ్లు, మేకలు, తదితర జంతువులను లెక్కిస్తున్నాయని, అదేవిధంగా అరణ్యంలో పులులు, సింహాలు, ఆడ, మగ లెక్కలు వేసేందుకు మంత్రిత్వ శాఖలు ఉన్నాయని, కానీ, జనాభాను లెక్కించడానికి.. ముఖ్యంగా బీసీ జనగణనకు వెనుకాడటం వెనుకబడిన కులాలను అవమానించడమేనని అన్నారు. ఇప్పటికైనా బీసీ కులగణనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

జాబ్‌కార్డులు ఉన్నవారందరికీ పనులు కల్పించాలి

- డ్వామా పీడీ జోసఫ్‌కుమార్
- అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు
- రూ.7.31 లక్షల రికవరీకి ఆదేశం



నిధుల వినియోగంపై చర్చిస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

పామూరు: జాబ్‌కార్డులు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ జోసఫ్ కోరారు. ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ 16వ ప్రజావేదిక కార్యక్రమాన్ని స్థానిక ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఎంపీడీఓ బొలినేని సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రజావేదికలో మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో ఏప్రిల్ 1 2023 నుంచి మార్చి 31 2024 వరకు జరిగిన మొత్తం 603 పనులకు సంబంధించి ఖర్చుచేసిన రూ.12.12 కోట్ల వివరాలను వివరించారు. వీటిలో మొత్తం 545 పనులకు సంబంధించి కూలీలకు రూ.9,97,85,362, మెటీరియల్ కింద రూ.14,90,417 కాగా, మొత్తం రూ.10,12,75,779 ఖర్చుచేసినట్లు తెలిపారు. అదేవిధంగా పీఆర్ కింద గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, పాలకేంద్రాలు, హెల్త్‌సెంటర్లు మొత్తం 56 పనులకు సంబంధించి మొత్తం రూ.1,96,31,522 ఖర్చుచేసినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ కింద చేసిన 2 పనులకు సంబంధించి మెటీరియల్ కింద మొత్తం రూ.2,69,617 ఖర్చుచేయడం జరిగిందన్నారు. కొన్ని పంచాయతీల్లో చేసిన చెరువు పనుల కొలతల్లో సరాసరి 10 శాతం వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా మస్టర్లలో తేడాలు, డబుల్ జాబ్‌కార్డులు, సంతకాలు లేకుండా మస్టర్లు, రికార్డుల నమోదుల్లో తప్పులను సామాజిక తనిఖీలో గుర్తించినట్లు తెలిపారు. వీటికి సంబంధించి మొత్తం రూ.3,32,577 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని తూర్పుకట్టకిందపల్లెలో నిర్మించిన ఆర్‌బీకే, బల్క్‌మిల్క్‌సెంటర్ పనులు పూర్తికాకుండానే రూ.3,98,400 అదనంగా బిల్లులు చెల్లించినట్లు తేలిందని, వాటిని కూడా రికవరీకి ఆదేశించామని అన్నారు. మండలంలోని వగ్గంపల్లె గ్రామానికి చెందిన 16 మంది రైతులు, నిమ్మచెట్లపల్లె గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు మొత్తం 19 మంది రైతులకు సంబంధించి 18 బత్తాయితోటలు, ఒక మామిడితోటకు సంబంధించి పెండింగ్ బిల్లులను ఏడాదిగా ఎందుకు చెల్లించలేదని, వారంలోగా రైతులకు బ్యాంకు ఖాతాలు ఏర్పాటుచేసి వెంటనే వారి ఖాతాల్లో నగదు జమయ్యేలా చూడాలని, లేకపోతే చర్యలు తప్పవని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. టీఏలు, ఎఫ్ఏలు బాధ్యతాయుతంగా పని చేయాలని, ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బొలినేని సురేష్, డీవీవో ఝాన్సీరాణి, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, ఏపీవో బి.మాల్యాద్రి, ఎస్ఆర్‌పీ వెంకటేశ్వరరావు, డీఆర్‌పీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి రూరల్: ప్రతి వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని చీమకుర్తి సీఐ సుబ్బారావు సూచించారు. చీమకుర్తిలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీమకుర్తి తూర్పు బైపాస్ కూడలిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అతివేగం, ఓవర్ టేకింగ్, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి వాటితో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, మితిమీరిన వేగం, ముఖ్యంగా యువత హై స్పీడ్ బైకులు నడుపుతుండటంతో వారితో పాటు ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు కడుపుకోత అనుభవించాల్సి వస్తోందని, అలాగే కుటుంబ పెద్దలను కోల్పోయిన పిల్లలు అనాథల్లా మారిపోతున్నారన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాల తీవ్రత తగ్గుతుందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వారు ప్రమాదాలు కొనితెచ్చుకోవడమే కాకుండా ఎదుటి వారి ప్రాణాలు కూడా తీసేందుకు కారణమవుతున్నారు. ప్రతి డ్రైవరు జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తూ వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని సీఐ సూచించారు.

అనుమతులు లేకుండా
దీపావళి మందులు విక్రయిస్తే చర్యలు

కొత్తపట్నం: అనుమతులు లేకుండా దీపావళి మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుధాకర్‌బాబు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో అన్ని గ్రామాల్లో నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందిన వారు మాత్రమే దీపావళి సామగ్రి అమ్ముకునే అవకాశం ఉందన్నారు. అనుమతులు లేకుండా విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు పొందిన వారు దుకాణాల ప్రాంతంలో ఇసుక, నీరు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జన సంచారం లేని ప్రదేశంలో విక్రయ కేంద్రం ఏర్పాటు చేసుకోవాలని, ముఖ్యంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా చూసుకోవాలన్నారు. ఎటువంటి అవాంతరాలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

చట్టాల ఆచరణతోనే ప్రజాస్వామ్య విజయం

ఒంగోలు: చట్టాల ఆచరణతోనే ప్రజాస్వామ్య విజయం సాధ్యమని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెద్దిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు అనిశెట్టి సాయికుమార్ రచించిన ప్రజాస్వామ్య ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అన్ని వర్గాల పౌరుల రక్షణకు మనచట్టాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలంతా సమానులేనని అన్నారు. సమానత్వ సాధన కోసం ప్రజాస్వామ్య వ్యవస్థ ఎలా ఉపకరిస్తుందో ఈ పుస్తకంలో సాయికుమార్ సమగ్రంగా చర్చించడం అభినందనీయమన్నారు. మరో మాజీ స్పెషల్ పీపీ పీవీఆర్ రాఘవరావు మాట్లాడుతూ చట్టాల ఆచరణలో పోలీసులు, న్యాయమూర్తుల పాత్రల గురించి విశేషంగా వివరించారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.రవికుమార్, చక్రవర్తి, డీఎస్‌కే, ఏ రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

మద్దిపాడు: స్థానిక బీసీ, ఎస్సీ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఆస్పత్రి డాక్టర్ ఆనందమోహన్ శనివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. చలికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, అందుకే విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామని డాక్టర్ తెలిపారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు, సూపర్‌వైజర్ బాలకోటయ్య, వైద్యశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదకొత్తపల్లి అంజయ్యనగర్‌లో ఎబేట్ చల్లించిన వైద్యసిబ్బంది...

మండలంలోని పెదకొత్తపల్లి అంజయ్యనగర్‌లో వైద్యశాఖ సిబ్బంది ఏఎన్ఏతో కలిసి మురుగు కాల్వల్లో, నీరు నిల్వ ఉన్న స్థలాల్లో దోమలు పెరగకుండా ఎబేట్ చల్లించారు. దోమ లార్వాలను చంపివేయడం ద్వారా దోమలు ఉత్పత్తి కాకుండా నివారిస్తే కొంత మేర దోమల బెడద తప్పుతుందని వారు తెలిపారు

సీతారాంపురంలో ఫాగింగ్...

మండలంలోని సీతారాంపురం గ్రామంలో శనివారం సాయంత్రం ఫాగింగ్ కార్యక్రమాన్ని వైద్యశాఖ సూపర్‌వైజర్ బాలకోటయ్య పర్యవేక్షించారు. దోమల బెడద నివారించే క్రమంలో సీతారాంపురంలో ఫాగింగ్ చేయించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది, గ్రామ సర్పంచ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పురుగు నివారణకు అగ్నిస్త్రంతో ఉపయోగం



అగ్నిస్త్రం కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న రాధ

ఒంగోలు సిటీ: శనగ, మినుము, వరి, తదితర పంటల్లో పురుగు నివారణకు అగ్నిస్త్రం మందు ఎంతో ఉపయోగపడుతుందని యూనిట్ ఇన్‌చార్జ్ సింగమనేని రాధ తెలిపారు. శనివారం మండల పరిధిలోని వలేటివారిపాలెం గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో 250 లీటర్ల అగ్నిస్త్రం తయారు చేశారు. తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాధా మాట్లాడుతూ రైతులంతా స్థానికంగా దొరికే ఆవుపేడ, ఆకులతో ఈ కషాయాన్ని తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఎటువంటి ఖర్చు లేకుండా పంట పొలాల్లో పురుగు నివారణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ అక్కా, ఐసీఆర్‌పీసీ కృష్ణవేణి, ఐశ్వర్య, మరియమ్మ, నాని, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

కొత్తపట్నం: మండలంలోని కె.పల్లెపాలెం, పాదర్తి, రంగాయపాలెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు శనివారం భూమి పూజ చేశారు. కె.పల్లెపాలెం గ్రామానికి 46 వర్కులకుగానూ రూ.2.06 కోట్లు, పాదర్తిలో 4 వర్కులకు రూ.20 లక్షలు, రంగాయపాలెంలో 21 వర్కులకు రూ.90 లక్షలు కేటాయించారు. త్వరలో ప్రారంభిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, మండల స్పెషల్ అధికారి జి.వెంకటనారాయణ, ఫిషరీష్ ఏడీ ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీకృష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తొలి మంచు కురిసింది..!

చలి కాలం మొదలైంది. తొలి మంచు పలకరించింది. పగటివేళ ఎండ దంచికొడుతున్నా.. రాత్రి వేళ వాతావరణం చల్లగా మారిపోతోంది. వారం రోజులుగా రాత్రులు రోజురోజుకూ చలి క్రమంగా పెరుగుతోంది. అర్ధరాత్రి సమయంలో, వేకువజామున మంచు ప్రభావం కనిపిస్తోంది.

– సాక్షి, ఒంగోలు



త్రోవగుంట వద్ద జాతీయ రహదారిపై విద్యుత్ దీపాలను చుట్టుముట్టిన మంచు



పొలంలో కురుస్తున్న మంచు